క్లుప్తంగా

రామేశ్వరస్వామికి రూ.2,77,531 ఆదాయం




తెనాలి టౌన్: పట్టణ గంగానమ్మపేటలోని రామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం హుండీని లెక్కించారు. మూడు నెలలకు గాను రూ.2,77,531 వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి వి.వి.రమణకుమారి తెలిపారు. కార్యక్రమంలో రామాలయం కార్యనిర్వహణాధికారి జి.అమర్‌నాథ్, అర్చకస్వాములు, ఆలయ ట్రస్టీలు, భక్తులు పాల్గొనారు.

విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు



తెనాలి అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి వారి ఆధ్వర్యంలో నందులపేటలోని హరితా ఇంగ్లిష్ మీడియం స్కూలులో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందుల్ని ఉచితంగా ఇచ్చారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కన్నెగంటి వెంకట కిశోర్‌కుమార్, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు యక్కల రామమోహనరావు, ఉదయశంకర్, నాయకులు టి.వెంకటేశ్వరరావు, బొమ్మదేవర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు



తెనాలి టౌన్: వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణ, రూరల్ గ్రామాల్లోని వివిధ సెంటర్లలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలకు భక్తులు విశేషంగా పూజలు జరుపుతున్నారు. మారీసుపేటలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం గణేష్ విగ్రహానికి మహా గణపతిగా అలంకరణ చేశారు. భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ సెంటర్లలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద పూజలు చేసి కాల్వల్లో నిమజ్జనం చేశారు. రూరల్ మండలం కొలకలూరు, గుడివాడ, కోపల్లె గ్రామాల్లో విగ్రహాల్ని కొమ్మమూరు కాల్వలో నిమజ్జనం చేశారు.

యువకుడి అనుమానాస్పద మృతిపై కేసు

ఫిరంగిపురం: యువకుడి అనుమానాస్పద మృతిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని వేములూరిపాడు గ్రామానికి చెందిన ఏ. శశికుమార్(26) ప్లంబర్ పని చేస్తుంటాడు. గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా శనివారం పొద్దుపోయిన తరువాత ఇంటికి వచ్చి ఇంటి పైనున్న గదిలో పడుకున్నాడు. మరునాడు ఉదయం కొడుకు నిద్రలేవకపోవడంతో తల్లి మంగమ్మ పొలం పనులకు వెళుతున్నానంటూ చెప్పి వెళ్లింది. సాయంత్రం పొలం నుంచి ఇంటికి వచ్చినా ఇంకా కుమారుడు నిద్రలేవకపోవడంతో తోటివారితో కలిసి డాబాపైకి వెళ్లింది. కేకలేసినా లేవకపోవడంతో అనుమానంతో చూసింది. అప్పటికే శశికుమార్ మృతి చెంది ఉన్నాడు. దీనిపై మంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సోమవారం మృతదేహాన్ని నరసరావుపేటలో పోస్టుమార్టం నిర్వహించేందుకు తరలించారు. తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా కిశోర్ తెలిపారు.

వినాయక గ్రామోత్సవంలో ఘర్షణ

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో సోమవారం రాత్రి జరిగిన వినాయకుడి గ్రామోత్సవంలో ఘర్షణ చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. పెదవడ్లపూడిలో వినాయకుడి గ్రామోత్సవం ప్రారంభం కాగా పిల్లలు ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో పెద్దలు ఘర్షణకు దిగడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయాలైన జయలక్ష్మి, నరసింహారావు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటల పోటీలు ప్రారంభం

మంగళగిరి: నగర పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 67వ ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను జె.బ్రహ్మారెడ్డి, కె.రామకోటిరెడ్డి, ఎస్.ప్రవీణ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణిస్తే మరింత మెరుగైన భవిష్యత్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజీవ్ రతన్, సెలక్షన్ కమిటీ సభ్యులు, పీడీలు బి.రమేష్, ఎన్.రవి, ఎం. సాంబశివరావు, ఎం.హరికృష్ణ, ఎస్.సాంబశివరావు, పద్మ, మంజుల, కె.రజనీనాయక్ పాల్గొన్నారు.

శభాష్ శ్రీహర్ష

- నేడు కళాప్రపూర్ణ కొండూరు వీరరాఘవాచార్యులు పురస్కారం ప్రదానం
- అంగుళం నుంచి అతి భారీ విగ్రహాల వరకు త్రీడీ శిల్పాలతో అంతర్జాతీయ ఖ్యాతి
- డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీలో నైపుణ్యం
- సౌదీ అరేబియా కంపెనీలో ప్రొడక్షన్ మేనేజరుగా అవకాశం



కాటూరి శ్రీహర్ష


తెనాలి: బుల్లి శిల్పాల రూపశిల్పిగా జాతీయ అంతర్జాతీయ ప్రాచుర్యం సాధించిన పట్టణానికి చెందిన యువ శిల్పకారుడు కాటూరి శ్రీహర్ష, మంగళవారం ప్రతిష్ఠాత్మక కొండూరు వీరరాఘవాచార్యుల పురస్కారాన్ని స్వీకరించనున్నారు. ఆలపాటి రవీంద్రపీఠం, దర్శనాచార్య, కళాప్రపూర్ణ కొండూరు వీరరాఘవాచార్యులు ధర్మనిధి సంయుక్తంగా గత 26 ఏళ్లుగా చిత్ర, శిల్పకళా రంగాల్లో పేరొందిన శిల్పకారులకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. స్థానిక కవిరాజు త్రిపురనేని శాఖా గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే ప్రత్యేక సభలో శ్రీహర్షను ఈ గౌరవంతో సత్కరిస్తారు.



రైతు-ఎద్దు

వారసత్వంగా శిల్పకళ

వారసత్వంగా వస్తున్న శిల్పకళకు అంకితమైన కుటుంబానికి చెందిన యువకుడు శ్రీహర్ష. తండ్రి కాటూరి వెంకటేశ్వరరావు దేవాలయాలు, దేవతా విగ్రహాలు, కాంస్య విగ్రహాల తయారీలో శిలాశాసనుడుగా గుర్తింపును పొందారు. ఆయన తనయుల్లో ఒకరైన కాటూరి రవిచంద్ర కోల్‌కతాలో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చదివి, వారసత్వ శిల్పకళకు అంకితమయ్యారు. వ్యర్థాలతో అద్భుతమైన భారీ శిల్పాలను తయారుచేస్తూ అంతర్జాతీయ గుర్తింపును సాధించారు. మరో తనయుడు శ్రీహర్ష విజువల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందారు. డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీలో కృషిచేశారు. అందుబాటులోకి వచ్చిన 3డీ టెక్నాలజీలో శిల్పాలను మలడంలో సాధన చేశాడు. అంగుళం నుంచి అతి పెద్ద విగ్రహాల వరకు ఇదే టెక్నాలజీలో శిల్పాలను తయారు చేస్తున్నారు.



గ్లోబుపై ఈగిల్

జపాన్‌లో తయారువుతున్న 3డీ స్లైసింగ్ సాఫ్ట్‌వేర్‌కు కస్టమైజింగ్‌గా పనిచేస్తున్న శ్రీహర్ష డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ సాంకేతిక నైపుణ్యానికి ఎడారి దేశం నుంచి ఆహ్వానం లభించింది. సౌదీఅరేబియాలోని ప్రముఖమైన స్టేషన్ గ్రూప్ కంపెనీలో డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో ప్రొడక్షన్ మేనేజరుగా నియమితులయ్యాడు. అతి త్వరలో బాధ్యతల్లో చేరనున్నాడు. శిల్ప, సాహిత్య, కవిత్వాది లౌకిక విద్యల నుండి తత్వ యోగాది, ఆధ్యాత్మిక విద్యల సహా రచనలతో డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యులు ప్రసిద్ధులయ్యారు. ఆయన పేరిట ఇస్తున్న అవార్డును 2002లో కాటూరి వెంకటేశ్వరరావు, 2015లో కాటూరి రవిచంద్ర స్వీకరించగా, ఆ కుటుంబంలోని శ్రీహర్ష ఇప్పుడు అందుకోనుండటం విశేషం.



మనిషి తనను తాను మలచుకుంటున్న శిల్పం



అడవి ఎద్దును వేటాడుతున్న పులి



ఎలిఫెంట్ ఫైట్



ఒంగోలు ఎద్దులు

‘స్పందన’లో 11 అర్జీలు

రహదారిపై గుంతలు పూడ్చించాలని ప్రజా సంఘాల వినతి

తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన సమావేశంలో 11 అర్జీలు వచ్చాయి. వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాల్ని అందజేశారు. కార్యాలయ పరిపాలన అధికారి (ఏవో) వెంకటస్వామి వాటిని స్వీకరించారు. అర్జీల్లో నాలుగు రెవిన్యూకు సంబంధించినవి కాగా, మున్సిపాలిటీ-2, పంచాయతీ-2, ఆర్ అండ్ బీ-1, గృహనిర్మాణ సంస్థ-1 ఉన్నాయి. వాటిని ఆయా శాఖల అధికారులకు పంపి, నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి కృషి చేస్తామని ఏవో వెల్లడించారు. తెనాలి-దుగ్గిరాల రోడ్డు మార్గంలో గుంతల్ని యుద్ధప్రాతిపదికన పూడ్చించాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతూ అర్జీనిచ్చారు. సీఐటీయూ నాయకుడు కొల్లిపర బాబూప్రసాద్, ఆర్టీసీ విశ్రాంత ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కన్నెగంటి శివశంకరరావు, ఎస్.సుబ్రహ్మణ్యం, కన్నెగంటి భాస్కరచంద్, దుర్గాప్రసాద్, వి.ఆదినారాయణ, ఎస్‌డీ సిరాజుద్దీన్, పీఎస్సార్ కృష్ణ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు భీమిరెడ్డి బ్రహ్మారెడ్డి, ఆర్.శివకృష్ణ, రాడ్ బెండింగ్ యూనియన్ నాయకులు ఎం.రవికుమార్, ఆటో యూనియన్ నాయకుడు ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.



సమస్యను వివరిస్తున్న ప్రజా సంఘాల నేతలు

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచండి



ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ, మున్సిపల్ అధికారులు, విద్యార్థులు

తెనాలి అర్బన్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని 22వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ అధికారులు, సుబేదార్లు క్రిషన్ జ్యోతి, అవతార్ సింగ్, సేవాదేవ్, జ్యోతి సింగ్ సూచించారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం, 22వ ఆంధ్ర బెటాలియన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛత పక్వాడా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యర్థాల్ని రోడ్లు, కాల్వలో వేయకుండా కార్మికులకు అందజేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిందని గుర్తుచేశారు. ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించవద్దని సూచించారు. కార్యక్రమంలో అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు సర్దార్ పరిశా, కె.స్వామి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటేషన్ సెక్రటరీలు ఎస్.ప్రవీణ్‌కుమార్, డి.సాగరయ్య, కె.సంధ్య, జె.హవెలా ప్రియదర్శిని, ఎన్‌సీసీ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆరోగ్య రంగంలో ఫార్మసిస్ట్ పాత్ర కీలకం

తెనాలి: స్థానిక ఏఎస్‌ఎన్ ఫార్మసీ కాలేజీలో సోమవారం ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఫార్మస్యూటికల్ ఫెడరేషన్ ఇచ్చిన ‘ఫార్మసిస్ట్ స్ట్రెంగ్తెనింగ్ హెల్త్ సిస్టమ్స్’ అనే అంశంపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రీసెర్చ్ విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ‘వైద్యం చేసే డాక్టర్ రోగికి ప్రాణం పోస్తే, ఆ వైద్యానికి అమృతాన్ని పోసేవారు ఫార్మసిస్ట్’గా ఆమె పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్యరంగంలో కీలకమైన ఫార్మసిస్ట్ ప్రాధాన్యతను వివరించారు. కాలేజీ ప్రిన్సిపాల్, ఏపీటీఏ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షత వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్ వై.ఫణికృష్ణ మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో ఫార్మసిస్టు పాత్ర కీలకమని తెలిపారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీని నిర్వహించారు. ఫార్మసీ, ఫార్మా-డీ విద్యార్థులు డి.జ్ఞానేశ్వరికి ప్రథమ బహుమతి, తేజస్విని ద్వితీయ బహుమతి, కిరణ్మయి తృతీయ బహుమతిని గెలుపొందారు. బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఫార్మా-డీ విద్యార్థులు తమ అనుభవాల్ని పంచుకున్నారు. అనంతరం డాక్టర్ కిరణ్మయిని సత్కరించారు.



డాక్టర్ కిరణ్మయికి సత్కారం

అనుమతులు లేకుండా అదనపు ఫ్లోర్‌లు నిర్మిస్తే చర్యలు

ఏసీపీలు సుబ్బారావు, సుధాకర్

తెనాలి అర్బన్: మున్సిపల్ అనుమతులు లేకుండా అదనపు ఫ్లోర్‌లు నిర్మిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అసిస్టెంట్ సిటీప్లానర్లు సుబ్బారావు, సుధాకర్ హెచ్చరించారు. నందులపేటలోని కాజావారి వీధిలో అనుమతులు లేకుండా ఆరు అంతస్తులు నిర్మించిన భవనాల శ్లాబ్‌లను సోమవారం పగులకొట్టారు. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఏసీబీ దాడుల్లో తెనాలి పట్టణంలో అనేక అనధికార కట్టడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని టౌన్ ప్లానింగ్ అధికారుల్ని వివరణ కోరిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ కట్టడాల కూల్చివేత ప్రారంభించినట్లు వారు తెలిపారు. తెనాలి పట్టణంలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మూడు అంతస్తులకు మాత్రమే అనుమతులు ఇస్తామన్నారు. అంతకుమించి నిర్మిస్తే వాటిని కూల్చి వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీఎస్‌లు సాంబశివరావు, సునీల్, చైన్‌మ్యాన్‌లు పాల్గొన్నారు.



నందులపేటలో అనుమతులు లేకుండా నిర్మించిన శ్లాబ్‌ను పగులకొడుతున్న సిబ్బంది

గల్లంతైన వ్యక్తి కోసం రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్

తెనాలి రూరల్: వినాయక నిమజ్జనానికి వెళ్లి అదృశ్యమైన ఆటో డ్రైవర్ కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. పట్టణంలోని యడ్ల లింగయ్య కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఉప్పు నాగబాబు(30) వినాయకుడి నిమజ్జనానికి స్నేహితులతో కలసి ఈ నెల 21న వెళ్లాడు. వీఎస్సార్ కళాశాల వద్ద తూర్పు కాల్వలో నిమజ్జనం పూర్తయ్యాక మిత్రులతో కలసి కాల్వలోకి దిగిన అతను కనబడకుండా పోయాడు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భార్య భవాని త్రీ టౌన్ పోలీసుల్ని మరుసటి రోజు ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. ఐదు రోజులు గడుస్తున్న ఆచూకీ లేకపోవడంతో సోమవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం తెనాలి వచ్చింది. నాగబాబు గల్లంతైన కాల్వలో గాలింపు చర్యలు చేపట్టింది. అయితే, తన భర్తకు ఈత వచ్చని, కాల్వలో పడినంత మాత్రాన గల్లంతవడని, అతను అదృశ్యమవడంపై పలు అనుమానాలు ఉన్నాయని ఆరోపిస్తోంది. విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కాల్వలో గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ఇంటింటికీ కొనసాగుతున్న సురక్ష సర్వే

తెనాలి అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే తెనాలిలో విస్తృతంగా జరుగుతోంది. గంగానమ్మపేట, సుల్తానాబాద్, ముత్తంశెట్టిపాలెం, 18వ వార్డు పరిధిలో సోమవారం ఉదయం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి టెస్ట్‌లను చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి, వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. వచ్చే నెల ఐదో తేదీ నుంచి నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాలకు వారిని తీసుకువెళ్లి పరీక్షలు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు గొడవర్తి శ్రీసాయి హరేరామ్, షేక్ గౌసియా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, దావులూరి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి హెచ్‌వీ దాసరి విజయకుమారి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఏఎన్‌ఎంలు రాణి, సౌజన్య, లక్ష్మీప్రసన్న, దేబోరా, సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తెనాలి గంగానమ్మపేటలో వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి కోకోకోలా కంపెనీ వద్ద ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. కోకో కోలా కంపెనీ వద్ద రోడ్డు పక్కన లారీ ఆగి ఉండగా అటుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. ప్రయాణికులు ఆందోళన చెందారు. ఇద్దరు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి, కేసు నమోదు చేశారు.

27న లీడ్ బ్యాంకుల ఎదుట ధర్నా

తాడేపల్లిరూరల్: జిల్లా లీడ్ బ్యాంక్ వద్ద ఈ నెల 27న నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు కోరారు. సోమవారం దుగ్గిరాల గ్రామంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 70 శాతం భూమిని కౌలు రైతులు సాగుచేస్తుండగా కేవలం 20 కోట్ల రూపాయలు పంట రుణాలు ఇవ్వడం హాస్యాస్పదమని అన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు భీమవరపు అమ్మిరెడ్డి, మాతంగి రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి నిడమర్రు రైల్వే గేటు మూసివేత

మంగళగిరి: నగరంలో నిడమర్రు రైల్వే గేటును మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్, రోడ్డు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26 నుంచి 29 తేదీ వరకు రైల్వేగేటు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. వాహనదారులు గమనించి ఇతర మార్గాలలో ప్రయాణించి సహకరించాలని రైల్వే అధికారులు కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

తాడేపల్లిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 130 బాటిళ్లను సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు.. పోలకంపాడుకు చెందిన కిశోర్ సీతానగరంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావడంతో అతడ్ని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారు. ముళ్లపొదల్లో దాచిన వంద క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలో నివాసముంటున్న కిశోర్ బావమరిది శ్రీనివాసరావు ఇంట్లో మరో 30 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం అమ్ముతున్న కిశోర్‌తో పాటు, మద్యాన్ని భద్రపరిచిన శ్రీనివాసరావును అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

కురగల్లులో..

మంగళగిరి: నగర పరిధిలోని కురగల్లు అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కురగల్లుకు చెందిన పల్లపు నాగేశ్వరరావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 16 మద్యం బాటిళ్లతో నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలు గానం అజరామరం

తెనాలి: ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ‘గాన గంధర్వ’ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని సోమవారం సాయంత్రం వివేక విద్యాసంస్థలు, తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధాన ఉపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. దీపజ్యోతులను వెలిగించి, ఆ మధుర గాయకుడు పాడిన కొన్ని ఆణిముత్యాల వంటి పాటల్ని గానం చేశారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు మాట్లాడుతూ సినీ రంగంలో గాయకుడిగా బాలసుబ్రహ్మణ్యం ముద్ర చెరగనిదని తెలిపారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం వంటి దక్షిణాది భాషల్లోనే కాకుండా హిందీ, పంజాబీ, బెంగాలీ, ఒరియా, తుళు వంటి ఉత్తరాది భాషలతో కలిపి 40 వేలకు పైగా పాటలు పాడినట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి గౌరవాల్ని అందుకున్న బాలు తెలుగువారికి గర్వకారణమని తెలిపారు. అనంతరం ఆయన జీవిత విశేషాల్ని వివరించారు. వివేక పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణమాచారి, వివిధ క్యాంపస్‌ల కార్యనిర్వహణాధికారులు మురళి, రాంబాబు, ఠాగూర్, అనూరాధ, వెంకటకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరనారాయణరావు

పేదలకు అన్నదానం

తెనాలి అర్బన్: ప్రముఖ సినీ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 3వ వర్ధంతిని రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రం వద్ద సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయకునిగా, నటునిగా సినీ రంగానికి ఆయన చేసిన సేవల్ని పలువురు కొనియాడారు. అనంతరం కోట అక్కేశ్వరరావు సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, నాగిశెట్టి సాయిచరణ్, జవ్వాది కోటేశ్వరరావు, పి.సూరిబాబు పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం చేస్తున్న అక్కేశ్వరరావు, శ్రీను తదితరులు

రోడ్లకు మరమ్మతులు చేయించిన పోలీసులు

తెనాలి రూరల్: గుంతలు పడి ప్రమాదకరంగా ఉన్న రోడ్లకు పోలీసులు మరమ్మతులు చేయించారు. గుంటూరు-హనుమాన్‌పాలెం రహదారిలో తెనాలి మండలం నందివెలుగు నుంచి జాకీర్ హుస్సేన్‌నగర్ వరకు పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు మలుపుల వద్ద చెట్లు పెరిగి రహదారి సరిగా కనిపించక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో రూరల్ సీఐ కె. శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు ఆయా గ్రామస్తులతో మాట్లాడారు. ప్రమాదాల నివారణకు చర్యల్లో భాగంగా వారి సహకారంతో సోమవారం గ్రావెల్, కంకరుతో గుంతల్ని పూడ్చించారు. పొక్లెయిన్‌తో రహదారి వెంబడి ప్రమాదకరంగా మొలచిన చెట్లను తొలగించారు. ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకున్న చర్యల్ని పలువురు అభినందించారు. సీఐ, ఎస్‌ఐతో పాటు రూరల్ ఎస్‌ఐ ప్రసన్నకుమార్ పనుల్ని పర్యవేక్షించారు.



రోడ్డుపై గుంతలను పూడ్చిస్తున్న సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

భాషా, సాహిత్యాభివృద్ధికి వావిళ్ల సంస్థ ఎనలేని కృషి

లక్ష్మీపురం: 1854లో పుస్తక ప్రచురణ రంగంలో ప్రవేశించి భాషా, సాహిత్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సేవలందించిన వావిళ్ల సంస్థ గురించి ఈతరం వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందని కవి, రచయిత, అధ్యాపకులు కె .జయకుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ‘వావిళ్ల సంస్థ గురించి తెలుసుకుందాం’ అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వావిళ్ల సంస్థ వ్యవస్థాపకులు వావిళ్ల రామస్వామిశాస్త్రి ఆయన తనయుడు వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రులు సంస్కృతాంధ్ర భాషా, సాహిత్యాలకు అనేక రకాలుగా సేవలు అందించారన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాహితీవేత్త ఎం.ప్రసాదరావు మాట్లా డుతూ అనేక తాళ పత్ర గ్రంథాలకు చేతిరాతలతో పాటు ప్రాచీన కావ్యాల్ని పండితులతో పరిష్కరింపజేశారని తెలిపారు. అనంతరం సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రసంగించారు.

యార్డులో పారదర్శకంగా వ్యాపార లావాదేవీలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో వ్యాపార లావాదేవీల్ని పారదర్శకంగా కొనసాగించాలని చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ సూచించారు. యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ షేక్ మాబుసుభా ని, పాలకవర్గ సభ్యులతో కలసి సోమవారం ఉద యం ఆయన యార్డును సందర్శించారు. వ్యాపార లావాదేవీలు, మిర్చి నాణ్యత, ధరలపై ఎగుమతి, దిగుమతి వ్యాపారుల్ని అడిగి తెలుసుకున్నారు. యార్డులో మిర్చి రైతులతో మాట్లాడారు. వసతులు ఏ విధంగా ఉన్నాయి.. గిట్టుబాటు ధర లభిస్తుందా..? లేదా? అడిగి తెలుసుకున్నారు. యార్డు ఆవరణలోని టీ స్టాల్స్, కూల్ డ్రింక్స్ షాపులు, బడ్డీ కొట్లను సందర్శించి, వారు విక్రయిస్తున్న ధరలు, నాణ్యతను ఆరా తీశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజనారాయణ మాట్లాడుతూ మిర్చి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించడంతో పాటు, మెరుగైన ధర లభించేలా చూడాలని వ్యాపారుల్ని ఆదేశించారు. దేశానికి వెన్నుముక అయిన అన్నదాతకు అన్ని విధాలుగా మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. యార్డులో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. యార్డును ప్రతి రోజు శుభ్రం చేయాలని చెప్పారు. యార్డు అధికారులు, సిబ్బంది నిత్యం పర్యవేక్షించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో యార్డు ఇన్‌చార్జి శివారెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు(ఆయా) పోస్టులకు అర్హులైన వివాహిత మహిళల నుంచి దరఖాస్తుల స్వీకరించనున్నట్లు సీడీపీవో టి. కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అంకిరెడ్డిపాలెం, అంకమ్మనగర్, గుజ్జనగుండ్ల, గోరంట్ల మేరి ప్రియనగర్, జానీనగర్ సుద్ద పల్లి డొంక, వెంగళరావునగర్ ప్రాంతాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వారు అక్టోబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఐసీడీఎస్ గుంటూరు అర్బన్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాలకు చెందిన నాగజ్యోతి (37) భర్త నుంచి విడిపోయింది. దీంతో మానసికంగా కుంగిపోయింది. గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ సమీపంలో సోమవారం పురుగు మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లింది. స్థానికులు గుర్తించి 108లో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com